# కథ (?)

తాత కృష్ణమూర్తిగారు బి. ఏ; యల్. టి.

"అర్ధరాత్రికావచ్చింది. ఇంకా యేమిటా వ్రాత? ...ఇంతకూ, ఎన్నాళ్ళకైన పూర్తిఅవుతుందిగనక నా, ఆనవల?"

కుర్చీ వెనక నిల్చుని, నాభుజంమీదనుంచి వంగి, టేబిలుపైనున్న కాగితాలవైపు చూస్తూవుంది, ఆ కొంటెకళ్లతో. కలంవిడిచి చిరునవ్వుతో తిరిగేను, ఆమెవైపు. ఎదురుగావున్న గడియారం గంటలు కొడుతూవుంది. చూస్తే, తొమ్మిదిగంటలే అయింది! అర్ధరాత్రికావచ్చిందనే లక్ష్మిని యేమనాలి?

పూర్వం కార్లయిల్ కవి యిట్లానే బల్లదగ్గిర వ్రాసుకుంటూవున్నప్పుడు భార్యవచ్చి, చెయ్యిపట్టుకులాగేదట—ప్రేమతో. పాపం ఆయిల్లాలిహృదయం తెలుసుకోలేక, ఆయన మూర్ఖంగా తనవ్రాతగొడవలోనే తన్మయుడై ఉండిపోయేవాడట. ఈకథ జ్ఞాపకంవచ్చి, లక్ష్మికి చెప్పేను. ముసిముసినవ్వుతో తలతమాషాగా వంకించి, "అవును మరి. 'కలంచునే సతులమాయల్ ధీరచిత్తంబులన్?' అని చెప్పలేదూ, మీ పెద్దనామాత్యుడు?" అన్నాది.

"ఏడిశాడు. లోకానుభవంలేని పొల్లునీతులు పలికే దద్దమ్మ! అబద్ధాలు, దొంగమాటలు చెప్పడం యీ కవులకు పరిపాటయింది."

"కవిత్వమంటే అదేగా?" అని నవ్వుకుంటూ, వయ్యారంగా వెనక్కితిరిగి వెళ్ళిపోబోయింది.

"ఉండు. వెళ్ళిపోతేనేం? ఇట్లాకూచో, యీ కుర్చీమీద." అని చెయ్యిపట్టుకున్నాను.

"ఎందుకు? నాకు నిద్ర వస్తూవుంది. పోయి పరుంటాను. మిమ్మల్ని పిలవడానికేం రాలేదిప్పుడు—అతగాడి పెళ్లాంవలె." అని నవ్వుతూ, "మీరు వ్రాసుకోండి. అపదమూడో ప్రకరణమేనా, ఇంకా?" అంటూ నాబలవంతంమీదకూచుంది, కుర్చీలో.

"నువ్వు ఆక్షేపించే ఆనవల కాదు, నేనిప్పుడు వ్రాస్తూవున్నది."

"మరొకనవల ప్రారంభించేరా యేమిటి, కొంప దీసి?" అంటూ విరగబడినవ్వడం ప్రారంభించింది.

నాఅంతబద్ధకిష్టి భూలోకంలో యెవడూలేడని ఆమె అభిప్రాయం. లేకుంటే, యీపాటికి నేనొక 'డికెన్సు' నో, 'షా' నో అయివుందునని వెర్రినమ్మకం కాబోలు! పుస్తకం ప్రారంభించడంలో ఉండే చురుకుదనం నాకు పూర్తిచేయడంలోలేదని ఎప్పుడూ చెప్పుతూఉంటుంది. "లేదు నవలకాదిది. ఏదైనా ఒకచిన్న కల్పితకథ వ్రాదామూ అని కూచున్నాను—పత్రికకోసం—ఏమీ ఊసుపోక" అని సమాధానం చెప్పేను.

"వెనకటికెవడో ఊసుపోనిమంగలి పిల్లిని పట్టుకున్నట్లు—"

"అదిగో, నాకవిత్వం, రచన, ప్రజ్ఞ, అంటే నీకంతవేళాకోళంగా ఉన్నాయికదూ?" అన్నాను, కొంచెం నొచ్చుకొని.

"చా, లేదు. మీరు వ్రాసే అబద్దాలు యెంతో బాగుంటాయి."

"హాస్యాలకక్కడికిగాని, యీకథవిని నీఅభిప్రాయం చెప్పు" అని బుజ్జగించేను.

"మంచికత్తే, నాకు! నేరకపోయివచ్చేను మీగదిలోకి.—" "అయితే వినవూ?"

"వింటాను—కథ సాంతం వ్రాసినపిమ్మట. సగంలో యేం తెలుస్తాయి, దానిమంచిచెడ్డలు? ఇంతకూ, యేకథవ్రాసినా, మన ప్రతాపాలేగా అందులో వర్ణించేవి?" అన్నాది.

"అనుభవంమీదవ్రాసే విషయాలకూ, కేవలం ఊహాశక్తివలన కల్పించినవాటికీ, యెంతో తేడావుంటుంది, మరి నిజంరుచించినట్టు అబద్ధం రుచిస్తుందా?" అని సమాధానంచెప్పడం ప్రారంభించేను.

"ఆమాటకొస్తే, నిజంకంటె అబద్ధమే యెక్కువ రుచి! పచ్చికూరకంటె వండినకూర రుచియెక్కువ.

మీరెంత నిజం వ్రాసినా, కొద్దో గొప్పో అబద్ధం మిశ్రమం చేస్తేనే కాని కథ అనిపించుకోదు కదా?"

"అడ్డువాదన మానవు కదా? అసలు, కథ వినకుండానే యీ చర్చ యెందుకు?"

"విన్న తరవాత కథ బాగులేదంటే, మీకు ఆగ్రహం రాదూ మరి?"

ఆమాటకు నాకు నిజంగా నవ్వొచ్చింది. కాని సమాళించుకొని, "కథ చదవమని నన్ను ప్రోత్సహించడానికి బదులు, చదవనియ్యకుండా చేస్తున్నావు. పోనీ, వినడానికి నీకంత యిష్టం లేనప్పుడు బలవంతమా యేమిటి? వెళ్ళి పడుకో—" అన్నాను.

నా ముఖవైఖరి, కంఠంలో కోపం, అన్నీ కనిపెట్టి, బుగ్గలు లొత్తపడుతూ మధురంగా నవ్వి, లేచి నా భుజాలు పట్టుకొని కళ్ళలోకి చూస్తూ నిల్చింది.

సాయంత్రం తలంటుకుంది కాబోలు, జుట్టు రేగి కళ్ళలోను, చెంపలమీద, పడుతూ వుంది గాలికి. నవ్వుతూ వుంటే, ఆ తాంబూలం నోట్లో ఎర్రగా దానిమ్మగింజలవలె కనిపిస్తున్నాయి పళ్ళు. యాలకు గింజలవాసన గుప్పున కొడుతూ వుంది, నా మొహం మీద. పెద్దగా వెలుగుతూ వున్న టేబిలు లైటు కాంతిలో చెంపలు నిగనిగ మెరుస్తున్నాయి, అద్దాలవలె. మాధుర్యం, కొంటెతనం, చనువు, ప్రేమ— అన్నీ మిశ్రమమై కనిపిస్తున్నాయి, ఆమె చూపులో. పెంకెది లక్ష్మి! నాకంటె పదేళ్ళు చిన్నది. ఇరవై రెండో యేడు కాబోలు. కాని, యింకా చిన్నతనం, పెంకెచేష్టలు మానదు. రంగు, పరిమళం, పువ్వును సహజంగా అంటుకొని ఉన్నట్లే పెంకెతనం, శృంగారం లక్ష్మి జీవితంలో ఐక్యమై ఉన్నాయి.

స్కూలు విద్య అట్టే లేదు కాని, పుస్తకజ్ఞానం, లోకానుభవం చాలా సంపాదించింది. వచ్చీరాని యింగ్లీషు ముక్కలు, కొత్తగా నేర్చుకుంటూ వున్న హిందీభాష, గ్రామఫోను పాటలు కూనిరాగంతో పాడగల నేర్పు, వెక్కిరింత బొమ్మలు వ్రాయగల చిత్రలేఖనా నైపుణ్యం—ఇవి, ఆమెకు గల యితర విద్యాభూషణాలు. తెలుగు పుస్తకాలు, పత్రికలు అర్థం చేసుకొని చదువుతుంది. అప్పుడప్పుడు వాటినిగూర్చి నాతో చర్చిస్తుంది—మొండివాదనతో కొమ్ములు తిరిగిన కవినైనా వెక్కిరించక మానదు.

నేనంటే అసలే లక్ష్యం లేదు. ఏమనుకుంటానో అన్నైనా సంకోచించదు. నోటికి వచ్చినంత మాటా అని తీరుతుంది. నన్ను రెగతాళి చేసి, విసిగించి, కోపం తెప్పించి, బుజ్జగించి, నవ్వుతుంది. "ఏమాటన్నా ఉడుక్కుంటారేం?—ఊరికే తమాషాకి అంటే?" అంటుంది, పైపెచ్చు.

"ఆ కథ యేదో చదవండి మరి, వింటాను." అంటూ కుర్చీలో కూరుచుంది మళ్ళీ. "ముందే చెప్పండి, కథ విని పొగడాలో, ఖండించాలో! అనక నన్ను నిష్ఠూరం మాటలనక—"

"చదవను. నువ్వు వినక్కరలేదులే."

"అదిగో, ఎందుకూ ఆ కోపం? కవీశ్వరులకు కోపం కూడా అదో కలక్షణం కాబోలు, లేక భూషణమో! చదువుకున్నవారు కనక, చెప్పండి—మీ షేక్స్పియరు, కాళిదాసు, తిక్కన, వీరంతా కోపిష్టివాళ్ళేనా?"

ఏడుస్తున్న వాళ్ళనైనా నవ్వించగల శక్తి ఉంది, లక్ష్మిలో. ముద్దుగా బుజ్జగిస్తుంది.

మెల్లగా నవ్వుతూ "నా కేమీ కోపం లేదు. దా, ఆ కుర్చీ కాస్త దగ్గిరగా జరుపుకో. కథ చదువుతాను. శ్రద్ధగా విను మరి—అడ్డుప్రశ్నలు వెయ్యక. కాని నీకు సందేహాలుంటే మాత్రం, అవశ్యం అడుగు. చెప్తాను." అని కాగితాలు సరిచూసుకొని, చదవడానికి సిద్ధపడ్డాను.

బుద్ధిగా కూచుని, నా వేపు ఓరగా చూస్తూ, "చదవండి చప్పున. ఈలోగా పిల్లవాడు కాని లేస్తే—" అంటూ యేమో సణిగింది.

"లేస్తే, ఆ పిల్ల వుందిగా, దాది?"

"దాన్ని కూచో పెట్టి చదివేస్తారా, తక్కిన కథ?"

"అయితే కథలు వినిపించడానికి యేమిటి, దాదిని కుదుర్చుకోవడం?" అని నవ్వుతూ అడిగినాను.

"కాకపోవచ్చును. కాని, యింట్లో ఆడమనిషి అంటూ ఉన్న తరువాత, యేపనికైనా అక్కరకు

928

వస్తుంది—మెత్తనిదయిలే. పురుషుడు భార్యను పెళ్లాడడం కథలు వ్రాసి వినిపించడానికా యేమిటి? కాని, నేను కూచుని వినడంలేదూ, బుద్ధిగా?"

చేతపట్టుకున్న కాగితాలు బల్లమీద పడేశాను.

"అదేమిటండి? మళ్ళీవచ్చిందాయేమిటి బుస్సు?"

"బుస్సూలేదు గిస్సూలేదు. ఇప్పుడు చదవనుకథ. ఇంకా పూర్తికాలేదు. పద—పోయి పడుందాం, హాయిగా" అంటూ లేచి నిల్చున్నాను.

"వ్రాసినంతవరకూఅయినా చదవండి. వినాలని కుతూహలంగావుంది, నాకు. నిద్రకూడా తేలిపోయింది. కూచోండి."

"కీలుబొమ్మనిచేసి ఆడిస్తున్నావు నన్ను. నీ యిష్టంవచ్చినప్పుడుచదివి, యిష్టంలేనప్పుడు మానేస్తాననుకున్నావా యేమిటి?" అన్నాను.

"చదవరా, యింత బ్రతిమాలుతూ వున్నా?" దీనంగా పెదవుల్లో ముద్దులు తొణికేటట్లు అన్నది, ఆమాట-రెప్పలుపైకెత్తి నావేపు నిదానంగాచూస్తూ. పెద్దచారడేసికళ్లు లక్ష్మివి. మృగాన్నయినా మంత్రించి మచ్చికచేయగలచూపు, అది!...మళ్ళీ కుర్చీలో చతికిలబడ్డాను.

నిజంగా లక్ష్మికి కథలంటే యెంతో సరదాఅని నాకు తెలును. వొల్లమాలినకథలువచ్చు దానికి. పురాణకథలు, సాంఘికకథలు, హాస్యంకథలు, డిటెక్టివుకథలు, భూతకథలు—యెన్నో చదివింది. ఏ యింగ్లీషుపుస్తకంనేనుచదివినా, అందులోవున్నకథ చెప్పేదాకా, వూరుకోదు. షేక్స్పియరునాటకకథలు, డీకామెరన్ కథలు, హెప్టామెరన్ కథలు, అరేబియన్ నైట్స్ కథలు, అన్నీ వరసపెట్టిచెప్పేను. స్ట్రాండ్, నాష్, మొదలయిన మాసపత్రికలలోవుండే కథలన్నీ చెప్పమని పోరుతుంది. షెర్లాక్ హోమ్స్ కథలంటే కొన్నాళ్ళు చెవికోసుకొనేది. టాగోర్ గారికథలు, లాక్ డొరగారి నవలలు వినిపించినతరవాత, పోలీసు కథలమీద మోజుతగ్గింది. అదిగాక, వయసుమారుతూ వున్నకొద్దీ లక్ష్మికి ఆశయాలలోను, అభిరుచులలోను, మార్పు వస్తూవుందనుకుంటా. తీక్ష్ణంగా ఆలోచనను రేపగలకథలు కావాలంటుంది.

"లక్ష్మీ! కథచదివి వినిపిస్తానుకాని, ముందు నువ్వొకషరతుకు వొప్పుకోవాలి." అన్నాను చిరునవ్వుతో.

"నాకుతెలును, ఆషరతు. అందుకు వొప్పుకుంటే, కథవినిన ఆనందమేవుండదు నాకు. కథ సాంతం వినకుండా విమర్శించకూడదంటారు—మధ్యమధ్య ప్రశ్నలడగకూడదంటారు—కొయ్యబొమ్మలవలె నోరుకట్టుకొని కూచోమంటారు!"

"అబ్బే, అట్లాటి అన్యాయంషరతుకాదు. నీ యిష్టంవచ్చినట్లు చర్చించవచ్చు. ప్రశ్నలడగవచ్చు. వెక్కిరించవచ్చుకూడా. మధ్యమధ్య నీప్రశ్నలు,సందేహాలు, ఆక్షేపణలు—ఇవిలేకపోతే సాగనేలేదు." అని అభయంయిచ్చేను.

"అయితే మరేమిటాషరతు?" అని అడిగింది, ఆశ్చర్యంతో బొమలుపైకెత్తి.

"ఏమీలేదు. బాగాఆలోచించి, నువ్వే యీకథకు నామకరణంచెయ్యాలి." "అంటే?"

"అంటే, యేపేరుపెడితే బాగుంటుందో చెప్పాలి. సరియైనపేరు నాకేదీ తోచలేదు. నీ సహాయం కావాలి." అని చెప్పేను.

"ఓ, అలాగే! నన్నుకూడ కవిత్వంలో తర్ఫీదు చెయ్యాలని సంకల్పమాయేమిటి?...తాచెడ్డకోతి వనమంతా చెరచిందట!" అన్నాది నవ్వుతూ.

"కవిత్వధోరణి నీలో స్వతహాగావుంది. నాబోటి లేనివాళ్ళు కృషిచేసుకోవాలి. నీకునేను నేర్పనక్కరలేదు. ఆమాటకొస్తే, నువ్వేనాకు నేర్పగలవు." అని కాస్త పొంగవేశాను.

"పోనీ,మీరన్నమాటే వాస్తవమైతే, నన్ను గురువుగా పెట్టుకోరాదూ?"అన్నాది, టెంకగా చూస్తూ.

"బెత్తందెబ్బలకు భయం!" అన్నాను హాస్యానికి.

"బెత్తంకూడా యెందుకు? శాస్త్రంలో మాకు ఆయుధం నిర్ణయించబడేవున్నది." అంటూ తనపాదుకైన త్రాచుపంటి జడపట్టుకొని వయ్యారంగా బెదిరించింది.

లక్ష్మి సొగసరి. అందం కలదని కించిత్ గర్వం కూడా!

"జడతో నేర్పవలసిన పాఠాలు వేరు! వాటికోసం శిష్యరికం చెయ్యడం నాకు ముచ్చటే." అన్నాను సరసంగా.

సిగ్గుతో తలవంచి, ముసిముసినవ్వు నవ్వుకుంది. క్షణం ఊరుకొని, "కథ చదవండి" అని ప్రోత్సహించింది.

కిటికీలోనుండి చల్లనిగాలి వీస్తూవుంది, శ్రావణ మాసపు నీటిగాలి. దాదాపు పదిగంటలరాత్రి కావచ్చింది. లక్ష్మి కట్టినచీర అందం, ఆమె తొడిగిన రవికె రంగు, అన్నీ పరిశీలిస్తూ కూచున్నాను, పరిపరివిధాల ఆలోచిస్తూ.

చిత్రమైనమనిషి, లక్ష్మి! క్షణం క్రిందట కథ చదువుతానంటే, వెఱ్ఱో వద్దని ఘోష పెట్టింది. ఇప్పుడు చదవమని నిలవదీస్తూవుంది. నిజంగా కథవినాలని కుతూహలమో, లేక నన్ను వెఱ్ఱికుట్టినిచేశామని సంకల్పమో? భర్త చిన్నవాడనీ, చదువుకున్నవాడనీ, సరస్వతీకటాక్షంవల్ల కవిత్వంచెప్పగలశక్తిమంతుడనీ, సంతోషించి గర్వించే అమాయకురాలుకాదు లక్ష్మి. నాయింగ్లీషువిద్యని తృణీకరిస్తుంది. పద్యాలు వ్రాయడానికి కూచుని, యతిప్రాసలకోసం నేనుపడే ఆవేదన చూసి, జాలిగా పెడుతుంది ముఖం. "ఆరు నెలలు సాముచేసి, మూలనున్న ముసలిదాన్ని యెదిరించాడట, వెనకటికో యోధుడు! అట్లావుంది, మీ కవిత్వ పటిమ! బిఏలు, యంయేలు చదువుకున్నామని ప్రగల్భాలు—తుదకు విద్యాప్రభావం యీరీతిగా పరిణమిస్తూవుంది. వ్రాసే దొకగీతపద్యం, లేకుంటే పిట్టకథ. అదైనాపోనీ, అర్థం తాత్పర్యం ఉన్నదైతే యేమో అనుకోవచ్చు" అని వెక్కిరిస్తుంది.

"భావకవిత్వమంటే మరేమిటనుకున్నావు?" అని యేదో సమాధానం చెప్పబోయాను, లోగడ.

"చాల్చాలు, ఊరుకోండి. వెఱ్ఱిమొఱ్ఱి గీతాలు వ్రాసి భావకవిత్వమనడం, ఉచ్చం నీచంలేని పిచ్చి కథలు వ్రాసి ప్రాబ్లమ్‌స్టోరీస్ అనడం—ఇదేగా మీ సజ్జాయిషీ?" అని యెదురుతిరిగింది.

లక్ష్మిధాటికి ఆగలేక, యీమధ్య పద్యాలువ్రాయడం బొత్తిగా మానుకున్నాను. చిన్నచిన్నకథలు, నవలలు వ్రాయడానికికూడా జంకుగా నేఉంది.

స్వతంత్రగ్రంథాలే వ్రాయాలంటుంది. తర్జుమాలు, అనుకరణాలు, దాస్యబుద్ధిని నిరూపిస్తాయంటుంది. 'చిత్రంచిత్రం మహాచిత్రం' అన్నట్టుండాలట కథలు. అంతేకాని, పాడినపాటేపాడు దాసరి అని, పాతపడిన తొక్కువిషయాలు మళ్ళీమళ్ళీవ్రాస్తే, యేం ప్రయోజనమని అడుగుతుంది. కథ నూతనంగా ఉండాలట, వ్రాత నూతనంగా ఉండాలట, ఆశ్చర్యం, సంతోషం కలుగుతూఉండాలట, చదువుతో ఉంటే ఫలానాకథమోస్తరని చెప్పడానికి వీలు లేకుండా ఉండాలట. అప్పుడుకాని రక్తి కట్టదట, కథ. అన్నీహిరణ్యాక్షవరాలు, దానివి.

పురాణకథలువ్రాస్తే, "యెంగిలికూడేకాని రుచించదా మీకు?" అని అడుగుతుంది. సాంఘికకథలు వ్రాస్తే, "ఎంతసేపూ దేశభక్తి, పాతివ్రత్యం, విధవా వివాహాలు, తోటికోడళ్ళతగవులు—ఇవేగా? తలనొప్పి!" అంటుంది. డిటెక్టివ్‌కథలువ్రాస్తే, "దొంగతనాలు, హత్యలు, విషం, రక్తం, కత్తులు, తుపాకులు, పోలీసులు—చదివేవాళ్ళకు పాడుకలలువచ్చి, ఆరోగ్యంచెడి, రోతపుడుతుంది" అని చెప్తుంది. ఇక ప్రకృతిశాస్త్రం, మానసికశాస్త్రం, నిరూపించేకథలు వ్రాస్తే, "స్వర్గానికివెళ్ళినా సవతిపోరు తప్పదన్నట్లు, కథల్లోకూడా యీశాస్త్రచర్చ యెందుకు?" అని చికాకుపడుతుంది.

"నీకు నచ్చినకథ వ్రాస్తే ప్రయోజకత్వమున్నా, లేకుంటే చేతకానితనమూనా?" అన్నాను, ఒకమాటెప్పుడో.

"విద్యాజ్ఞానము, విమర్శనాశక్తి లేని నాబోటి ఆడదానికే మీపుస్తకం రుచించనప్పుడు, లోకానికేం రుచిస్తుంది? ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికెగిరిందట!" అని యెత్తిపొడిచింది.

అంచేత, యేదైనా కథవ్రాయడానికి నిశ్చయించినప్పుడు, ముందుగానే లక్ష్మితో కలబోసుకోవడం

930

నాకు పరిపాటయింది. ఆమెతో చర్చించినపిమ్మట, ఒక్కొక్కప్పుడు వేసుకున్నప్లాను తల్లక్రిందుగా మారిపోవడంకూడా కద్దు. మొండివాదనైనా, లక్ష్మిది సూక్ష్మబుద్ధి. నిజంకనిపెట్టి నిర్మొగమాటంగా చెప్తుంది. తిక్కతిరిగి శ్లాఘించడానికి ప్రారంభించినా, అంతే. భుజాలుప్పొంగేటట్లు పొగడి, ఆకాశాని కెత్తేస్తుంది. తెలుగుపుస్తకాలలో అప్పారావుగారి "కన్యాశుల్కం"వంటి ఆదర్శగ్రంథం మరొకటి లేదని వాదించింది, నాతో అనేకసార్లు. ఆమోస్తరుగా వ్రాయడానికి ప్రతీవాడికీ చేతవుతుందా, మరి?

నవ్వుకథలంటే బలేసరదా లక్ష్మికి. హాస్యరసం వ్రాయలేనికవిని శుంఠగా భావిస్తుంది—వాడెంత ఉద్దండపండితుడైనాసరే. అయితే విషాదాంతకావ్యాలలోను, యేడుపుకథలలోను, ఉండే స్వారస్యం గ్రహించలేదనికాదు. "ఒథెల్లో" నాటకం చాలా గొప్పదని పొగడుతుంది. ద్విజేంద్రలాల్ రాయిగారి "షాజహాన్" నాటకం హిందీలోచదివి, "షేక్స్పియర్ వ్రాసిన 'లియర్' నాటకంకంటె, ఎన్నోరెట్లు బాగుంది, యిది" అని అభిప్రాయం యిచ్చింది.

మొత్తంపైని యేకథచదివినా, అందులోఉండే లోపాలే ముమ్ముందు కనిపిస్తాయి, లక్ష్మికళ్ళకి. ముఖ్యంగా నేనువ్రాసిన కథలైతే, బూరెల్లోపురుగు లెంచినట్లు, వాట్లోవుండే లోటుపాట్లను వెతికివెతికి పైకితీస్తుంది. చిన్నకథైతే, యెందుకీ బాలకవిత్వమంటుంది. పెద్దకథైతే, చేంతాడులాగుచదివిన కొలదీ పెరుగుతూవుందేమని చికాకుపడుతుంది. కథలో నాయకిని రూపవతిగావర్ణిస్తే, "అవును, నాయకి అన్నది అందంగాఉండకపోతే కథనడవదు. మీ పెద్ద కవులెవరూ కురూపినాయకిల్నిగూర్చి వ్రాయలేదుగా?" అని ఎగతాళిచేస్తుంది. నాయకిని సామాన్యంగా చిత్రిస్తే, "కథలోకూడా ఆడదాన్ని అసహ్యపరచాలా? మాటవరసకైనా స్త్రీని గౌరవించకూడదు కాబోలు! మీ మొగవాళ్ళకంటికి, ఆమెలోఉండేలోపాలే ముమ్ముందుగోచరిస్తాయా?" అనిపోట్లాడుతుంది.

ఒకమారెప్పుడో నవ్వుకథేదో వ్రాశాను. సంతోషిస్తుందికదా అని లక్ష్మికి చూపించాను. శ్రద్ధగా తనలో చదువుకొని, యేమీఅనకుండా చేతికందించింది.

"నవ్వు రాలేదూ,—ముంగిలాగు మూతిముడుచుకొని చదివావు?" అన్నాను.

"ఏడవలేక నవ్వాలి, మీకవిత్వంచూసి."

"అదిగో, నోటిదురుసుతనం మహా ఉందిసుమా, నీకు!" అన్నాను కోపంతో.

"నిజంఆడితే నిష్ఠూరం! ముందుగానే చెప్పలేకపోయారూ, యీకథచదువుతూ నవ్వాలిసుమా అని? నాకేం తెలుసు, అది హాస్యంకథఅని? మీవంటి కోపదారికవులు హాస్యాలువ్రాస్తే, దూర్వాసముని సరసం వలె ఉంటుంది."

చిన్నబుచ్చుకొని ఊరుకున్నాను. నావేపు అట్టే నిదానించిచూసి, పకపకనవ్వుతూ, "ముక్కుమీద ఉంటుంది, కోపంమీకు! ఏమంటారో చూదామనే, నేనూ ఎత్తుఎత్తేను. నవ్వొచ్చినా అణచిపెట్టుకొని, నవ్వలేదు. అంతేకాని, మరేంలేదు. కథ చాలా బాగుంది" అని సమాధానంయిచ్చి, వొళ్ళుపులకరించేటట్లు పొగడింది.

ఇట్లాంటిముచ్చట్లువెనకటివన్నో జ్ఞాపకంవచ్చేయి. కథ చదువుదామన్న అభిలాషకొంచెం తగ్గింది. కాని చదవకపోతే లక్ష్మికి కోపంవస్తుంది. సొగసుకత్తెలకు అలకకూడా ఒక శృంగారమే అన్నమాట ఎరుగుదును కాని, లైటు కొంచెంపెద్దదిచేసి, కాగితాలు తీశాను, కథచదవడానికి.

అవతల వర్షం ప్రారంభమైందికాబోలు, చినుకుల చప్పుడు వినవచ్చింది. గాలి తీవ్రంగా వీస్తూవుంది, కిటికీలలోనుండి దీపం నిలిచేటట్లులేదు. ఉయ్యాల్లో వున్న పిల్లవాడు కెవ్వున యేడుస్తూలేచేడు. తృళ్ళిపడి లేచింది లక్ష్మి.

"పోనీ, రేపు చదువుకుందాంలే, కథ. ఇంకా కొద్దిగా వ్రాయవలసివుందికూడా. పైగా నాకూ నిద్ర వస్తూవుంది" అంటూ దీపంతగ్గించి లేచేను.